
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
శుక్రవారం 28 నవంబరు 2025



అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం 4
రేపటి నుంచి పల్నాడు బాలోత్సవం
నా సంతకం ఫోర్జరీ చేసి..నగదు డ్రా చేశారు
● పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ ఫిర్యాదు 6





ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీవారి చిత్తంతోనే అమరావతి

- వెంకన్న ఆలయానికి రాజధానిని కాపాడే శక్తి
- రూ.260 కోట్లతో శ్రీనివాసుడి ఆలయం అభివృద్ధి
- ఆలయ విస్తరణకు శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు
- వెంకటపాలెంలో వైభవంగా భూమిపూజ, అద్వేష్టక శిలేష్టకాన్యాసం



శంకుస్థాపన క్రతువులో పాల్గొన్న సీఎం చంద్రబాబు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'దేవతల రాజధాని అమరావతి.. మన రాజధాని కూడా అమరావతి. దేవతల రాజధాని ఎలా ఉంటుందో.. ఆ నమూనాగా అమరావతి ఉండాలి. ఆయన ఆశీస్సులతోనే అమరావతి నిర్మాణం ముందుకు సాగుతుంది. ఆయన చిత్తంతోనే రాజధాని రైతులు కూడా అమరావతి కోసం భూములిచ్చారు. అమరావతి విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానం అవసరం లేదు. ఆ దేవదేవుడే అమరావతిని రక్షిస్తాడు. వేంకటేశ్వరస్వామి సంకల్పంతోనే రాజధానికి అమరావతి అనే పేరు పెట్టాను..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంకటేశ్వర స్వామిని కోరుకున్నారు. గురువారం ఉదయం రాజధాని పరిధిలోని వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.260 కోట్లతో అభివృద్ధి పనులకు టీటీడీ సంకల్పించింది. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వరస్వామివారి ద్వితీయ చతుర్ద్వార మహా ప్రాకార నిర్మాణం, మాడవీధులు, అన్నదాన కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. భూమిపూజ, అద్వేష్టక శిలేష్టకాన్యాసం అత్యంత వైభవోపేతంగా జరిగింది. అర్చకుల వేద మంత్రాలు, మంళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముఖ్యమంత్రి పునాదిరాయి వేశారు. అర్చకులు చతుర్వేద పారాయణం, నివేదనం, దివ్య సమర్పణ, హోమం, పూర్ణాహుతి, వేదాశీర్వచనం నిర్వహించారు. ఆలయానికి సంబంధించి మాస్టర్ ప్లాన్ పరిశీలించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ముఖ్యమంత్రికి శ్రీవారి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 2019లోనే ఆలయాన్ని నిర్మించేందుకు సంకల్పించామని, ఇప్పుడు దానిని పూర్తి స్థాయిలో అభివృద్ధి (మిగతా 6వ పేజీలో)



టీటీడీ బోర్డు సభ్యులతో సీఎం చంద్రబాబు

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కన్నా

నకరికల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని నరసింగపాడు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించి రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా కూడా పని చేస్తున్నాయన్నారు. దళారుల ప్రమేయం లేకుండా మిల్లర్ల చేతుల్లో రైతులు మోసపోకుండా ధాన్యానికి గిట్టు బాటు ధర వచ్చేలా ప్రభుత్వం పార దర్శకంగా కొనుగోళ్ల చేపడు తుందన్నారు. రైతు సేవా కేంద్రం వద్ద, అగ్రి కల్చర్ అసిస్టెంట్ ధాన్యం సేకరించే తేదీ, సమయంతో కూడిన కూపన్ ను జారీ చేస్తు న్నట్లు తెలిపారు. రైతులు తమ వాట్సాప్ ద్వారా 7337350375 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపి ధాన్యం కొనుగోళ్ల షెడ్యూల్ చేసుకోవచ్చన్నారు. ధాన్యం ఎగుమతి నుంచి మిల్లులో దిగుమతి అయ్యే వరకు జీపీఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, మండల ప్రత్యేక అధికారి ఝాన్సీరాణి, జిసుగు చంద్రారెడ్డి, కైపు రవీంద్రారెడ్డి, జిసుగు వెంగళరరెడ్డి సాగి శ్రీనివాసరావు, నాగోతు శౌరయ్య, షేక్ అలీ బాషా, బద్రి రమణారెడ్డి పాల్గొన్నారు.



నరసింగపాడులో ధ్యాన్యంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



పుడమి తల్లి రుణం తీర్చుకోవాలి

◆ సభలో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, వేదికపై సామాజిక వేత్త దుర్గా కామేశ్వరరావు మండలి బుద్ధప్రసాద్, ఆలపాటి తదితరులు

- డాక్టర్ పీడీకేరావు సేవలు నిరుపమానం
- సేవ తృప్తినిస్తుంది.. మనపై అభిమానం పెంచుతుంది
- భారతజ్యోతి పురస్కార సభలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తెనాలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'నేటి యువత అమెరికా, జర్మనీ అంటూ విదేశాల బాటపడుతున్నారు. మాతృమూర్తిని, పుట్టిన గడ్డను వదిలిపెట్టి సంపాదన కోసం జీవిత సత్యాన్ని మరిచి పరుగులు పెడుతున్నారు. అటువంటి వారికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన డాక్టర్ పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు(పి.డి.కె.రావు) వంటి వారి జీవితం ఆదర్శంగా నిలుస్తుంది.' అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. అమెరికాలో డాలర్లు కురిపించే ఉద్యోగాన్ని వదలి, పుట్టిన గడ్డపై సేవ చేయాలనే నిర్ణయంతో ఆనాడే తిరిగివచ్చి.. వెనుకబడిన గ్రామాల ప్రజల ఉన్నతికి పాటుపడటం నిజంగా నేటి రోజుల్లో ఆదర్శమే అవుతుందన్నారు. సేవ తృప్తినిస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయ న సూచించారు. గురువారం తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో తెనాలి ప్రచురణలు, రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన భారత జ్యోతి పురస్కార ప్రధాన సభకు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. సభకు ముందే భారత జ్యోతి పురస్కారాన్ని కామేశ్వరరావుకు వెంకయ్యనాయుడు చేతుల మీదగా ప్రదానం చేశారు. పీడీకే రావు పరిచయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భం గా సభలో మాజీ ఉప రాష్ట్రపతి మాట్లా డుతూ.. సమాజంలో మార్పు కేవలం ప్రభుత్వాల వల్ల కాదని, ప్రజల్లో మార్పు, సేవా భావం పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేవలం నాలుగు గోడలకే చదువు పరిమితం కాకుండా వ్యవసాయ క్షేత్రాల వంటివాటికి కూడా అలవాటు చేయాలని కోరారు. ఈ నేలపై ఉన్నందుకు పుడమి తల్లి రుణం కూడా తీర్చుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సిన (మిగతా 6వ పేజీలో)

నానో యూరియా

- తమకొద్దంటున్న రైతులు
- ప్రతి మూడు బస్తాలకు లీటర్ కొనాల్సిందే
- సొసైటీలు, డీసీ ఎంఎస్‌లో ఒత్తిడి

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి): ఏ వస్తువు అయినా.. కొనుగోలు విషయంలో కొనుగోలుదారులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. ఎరువుల కొనుగోలు విషయంలో మాత్రం రైతులకు ఆ స్వేచ్ఛ ఉండటం లేదు. రైతుకు ఇష్టం ఉన్నా.. లేకపోయినా నానో యూరియా కొనాల్సిందే నని పట్టుపడుతున్నారు. మొన్నటి వరకు.. ప్రైవేట్ డీలర్లు ఈ విధంగా పట్టుబట్టి మరీ.. ఇష్టం లేని ఎరువులను అంటగట్టే వారు. ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా అదే వ్యాపారం మొదలు పెట్టడం వివాదాస్పదమవుతోంది. కేంద్రం రాయితీపై యూరియా బస్తా రూ.266.50కు రైతులకు అందజేస్తోంది.గతంలో ప్రైవేట్ డీలర్లు బస్తా రూ.290 నుంచి రూ.350 వరకు వసూలు చేస్తున్నా రన్న ఆరోపణలతో.. ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో)



పురాలకు సరిపుడా నిధులు

- రూ.2.60 కోట్లు విడుదల
- పుడా ఆదాయం రూ.4.50 కోట్లు
- నిధులతో పట్టణాల్లో ప్రగతి పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) మునిసిపాలిటీలకు రూ.2.60 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో పట్టణాల్లో ప్రగతి పనులు చేపట్టేందుకు.. పురపాలక సంఘాలు టెండర్ ప్రక్రియలను పూర్తి చేసి.. పనులు ప్రారంభిస్తున్నాయి. పుడా ఇప్పటి వర కు సూమారు రూ.4.50 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. మునిసిపాలిటీల్లో భవనాల నిర్మా ణం, రియల్ వెంచర్లకు సంబంధించిన ఫీజుల ద్వారా ఈ ఆదాయం లభిస్తోంది.



పూడా కార్యాలయం

పట్టణాల వారీగా నిధుల విడుదల ఇలా..

పుడా విడుదల చేసిన నిధులను జిల్లాలోని మునిసిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేస్తారు. మురుగు కాల్వలు, తాగునీటి పైపులైన్లు నిర్మిస్తారు. నరసరావుపేట మునిసిపాలిటీకి రూ.25 లక్షలు, దాచేపల్లి మునిసిపాలిటీకి రూ.25 లక్షలు, గురజాలకు రూ.25 లక్షలు, మాచర్లకు రూ.45 లక్షలు, పిడుగురాళ్లకు రూ.50లక్షలు, వినుకొండకు రూ.40 లక్షలు, చిలకలూరిపేట మునిసిపాలిటీకి రూ.50 లక్షలు నిధులు విడుదలయ్యాయి. పుడాకు ప్రస్తుతం జేసీ ఛైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పుడా ఛైర్మన్‌గా మాచర్ల టీడీపీ నేత చిరుమామిళ్ల మధుబాబును నియమించినట్లు ఈ నెల 22న ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఆయన నియమాకానికి సంబంధించి జీవో విడుదల చేయాల్సి ఉంది. పుడా వైస్ ఛైర్మన్ బాధ్యతలను సాంబశివరావు నిర్వహిస్తున్నారు.

దశలవారీగా అభివృద్ధి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



కస్తలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :గ్రామాలను దశల వారీగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని కస్తల గ్రామంలో ప్రజల వద్దకు ప్రవీణ్ వంద రోజులు వంద గ్రామలు కార్యక్రమంలో భాగంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల అభివృద్ధిలో భాగమై బాధ్యతతో సమస్యలను పరిష్కరించాలని పిలుపు నిచ్చారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు మండల కేంద్రంలో రివ్యూ నిర్వహి స్తానన్నారు. ప్రతి రోజూ గ్రామాల్లో ఉంటానని తెలిపారు. అధికారులు గ్రామ సచివాలయాల్లో వారానికి ఒకసారి ప్రజాదర్బార్ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో ఏడు సంవత్సరాలుగా ఇసుక కార్మికులకు పనులు లేవని, ఖరీదైన ఇసుక పడవలు మరమ్మతులకు గురవుతున్నాయని, వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే ప్రవీణ్‌ను గ్రామస్తులు కోరారు. వారి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొర్లకుంట శ్రీధర్, ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే జానీ బాషా, సర్పంచ్ సుభానీ పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

డీఈవో చంద్రకళ

ఈపూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని బోధన జరుగుతోందని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ అన్నారు. ఈపూరు మండలంలోని ముప్పాళ్ళ, ఈపూరు హై స్కూల్స్, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ వసతి గృహాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ముప్పాళ్ళ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న ఆరేపల్లికి చెందిన గుడిమెట్ల ఇందు కొంతకాలంగా పాఠశాలకు రాకుండా మానేసింది. స్కూల్ విజిట్ సమయంలో ఆ విషయం తెలుసుకున్న డీఈవో ఇందు వాళ్ళ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి బాలికను పాఠశాలలో చేర్పించింది. ఈపూరు హై స్కూల్ మోడల్ స్కూల్ లోని విద్యార్థులతో బోధనా విషయాల గురించి చర్చించారు. వనికుంట వద్ద నిర్మాణంలో ఉన్న మోడల్ స్కూల్ నూతన భవనాన్ని ఆమె పరిశీలించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సందర్శించి నిర్మాణంలో ఉన్న వసతి గృహ భవనాన్ని పరిశీలించారు. అనంతరం డిఈఓ మాట్లాడుతూ పదవ తర గతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి నిర్వహిస్తున్న రైజింగ్ స్టార్ కార్యక్రమం జనవరి కల్లా పూర్తవుతుందన్నారు. ఆమెతోపాటు ఎంఈఓ 2 రామ తులసి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.



బడి మానేసిన విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

ఆకాశమంత అభివృద్ధే లక్ష్యం

- వరికపూడిశెల పూర్తయ్యే వరకు విశ్రమించను
- ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆకాశమంత అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం మాచర్లలోని మార్కెట్‌యార్డు ప్రధాన ద్వారా ముందు భాగంలో మాచర్ల, రెంటచింతల, గురజాల పట్టణాలకు సంబంధించిన ఇన్నర్ బైపాస్ రోడ్డు నిర్మాణాలకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు భూమిపూజ నిర్వహించారు. రూ. 54.09 కోట్ల నిధులతో నిర్మించనున్న ఈ రోడ్లకు శంకుస్థాపన చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా వేదికపై మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు వివరించారు. పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే వేల కోట్లతో దాదాపు 231 కి.మీ. మేరకు నూతన హైవే రోడ్లను నిర్మించుకున్నామన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ పూర్తి చేసే వరకు విశ్రమించేది లేదన్నారు. నియోజకవర్గ పరిధిలో రూ. 1200 కోట్లతో జల్ జీవన్ మిషన్, రూ.124 కోట్లతో అమృత్ పథకాల పనులకు త్వరలో శంకుస్థాపనలు జరుగుతాయని వెల్లడించారు.

అరాచకం రాజ్యమేలితే.. అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రాంతీయంగా అరాచకం రాజ్యమేలితే అభివృద్ధి శూన్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నమ్మిన సిద్ధాంతానికి తాను కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, ఆ ప్రశాంతతకు భంగం కలిగించేందుకు వైసీపీ శ్రేణులు అలజడులు సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన రూ. 50 కోట్ల నిధుల హామీ కార్యరూపం దాల్చిందన్నారు. పట్టణ చరిత్రలో రూ.54.09 కోట్లతో రోడ్ల విస్తరణ జరగడం గర్వకారణంగా ఉందన్నారు. తెలంగాణ లిక్కర్‌ను మాచర్లకు తీసుకొచ్చి అమ్మకాలు జరిపి ఆదాయానికి గండి కొడుతున్న ఏ ఒక్క వైసీపీ అక్రమార్కులను వదిలిపెట్టమని హెచ్చరించారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ

దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు (విద్య) నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు డిసెంబరు 3వ తేదీకి పొడిగించినట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మయూరి గురువారం పర్యటనలో తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణకు ఎంపిక చేసేందుకు డిసెంబర్ 7న ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 0863 -2358071 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

● 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

బాపట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో వరుస ద్విచక్రవాహనాల దొంగతనం కేసులను సీసీఎస్ , అమర్తలూరు పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను చాకచాక్యంగా అరెస్ట్ చేశారు. గురువారం ఎస్పీ బి.ఉమామహేశ్వర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి, కేసు వివరాలను వెల్లడించారు. యద్దనపూడి మండలం చిమటవారిపాలేనికి చెందిన థంకసాల సుబ్బారావు తన డీలక్స్‌బైక్ అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామంలో గత జూన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. వరుస ద్విచక్ర వాహనాల దొంగతనాలు చోటు చేసుకోవటంతో దీనిపై దృష్టిసారించారు. బాపట్ల సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ ప్రేమయ్య, అమర్తలూరు ఎస్సై రవితేజ, సిబ్బందితో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో.. అంతర్‌రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగలు ఆరుగురును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. రూ.16.5లక్షల విలువ గల 22 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వినుకొండకు చెందిన కొమ్మ వెంకటసాయి, కొమ్మ సాయికృష్ణ, సంపంగలి నాని, సయ్యద్ నాగూర్‌వలి, పందుల రమేష్‌బాబు, పొదలికి చెందిన బండి శివారెడ్డి నిందితులని చెప్పారు. సీసీఎస్, అమర్తలూరు పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, క్యాష్‌రివార్డులను అందజేశారు. సీసీఎస్, రేపల్లె డీఎస్పీలు జగదీష్‌నాయక్, శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ ప్రేమయ్య పాల్గొన్నారు.

33,916 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 35,654 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 33,916 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,710 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	11000	13700
334	10000	17500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11000	15300	334	11000	17400
273	---	----	నెంబరు. 5	10500	15800
341	10500	17300	273	---	---
4884	----	---	341	12000	17400
సూపర్ 10	---	----	4884	12000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15600	తేజ	10500	15300
షార్క్-1	---	----	బ్యాడిగి	11000	17700
బ్యాడిగి	10500	17600	దేవనూరు డీలక్స్	10500	16500
దేవనూరు డీలక్స్	11000	17000	తాలుకాయలు	5000	8200

అమరావతి అభివృద్ధికి రైతుల మద్దతు కావాలి

● రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించండి
● అప్పుడే హైదరాబాద్ తరహాలో అభివృద్ధి: రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు
● 22 రకాల సమస్యలు వివరించాం.. సీఎం సానుకూల స్పందన
● అమరావతి రాజధాని ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లా అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని సీఎం చంద్రబాబు చెప్పారు. రాజధాని రైతులతో ఆయన పలు విషయాలు ప్రస్తావించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆయన ఏమన్నారంటే.. "రాజధానిగా 1953లోనే విజయవాడ కావాల్సి ఉంది. అప్పుడు కమ్యూనిస్టుల ప్రాబల్యం వల్ల నాటి ప్రభుత్వం కర్నూలును రాజధానిగా చేసింది. ఆ తర్వాత తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఒకే రాష్ట్రంగా ఉండాలని హైదరాబాద్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. విభజన సమయంలో రాజధాని ప్రాంతం విషయంలో పలు ప్రతిపాదనలు వచ్చినా.. గతంలో ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని అమరావతిని రాజధానిగా నిర్ణయించాం. అమరావతి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే నేను తీసుకునే నిర్ణయాలకు రైతుల మద్దతు కూడా కావాలి. కార్పొరేషన్ స్థాయిలో అమరావతి అభివృద్ధి చెందాలంటే రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు వెళ్లాల్సిందే. అప్పుడు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులు, స్పోర్ట్స్ సిటీ, వివిధ పరిశ్రమలు వస్తాయి. మిమ్మల్ని అడిగే రెండవ దశ ల్యాండ్ పూలింగ్‌కి వెళుతున్నాం. ఇక్కడకు వచ్చే కంపెనీలకు భూములు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇక్కడే మన వారికి ఉద్యోగాలు వస్తాయి. భూములు విరివిగా ఉండడంతో హైదరాబాద్ అన్ని వైపులా నుంచి అభివృద్ధి చెందింది. అమరావతి కూడా అదే విధంగా అభివృద్ధి చెందుతుంది. రైతులెవరూ రిటర్నబుల్ ప్లాట్లు అమ్ముకోవద్దు. మీలో సఖ్యత లేకపోతే అమరావతి కుక్కలు చింపిన విస్తరి అవుతుంది. ప్రభుత్వానికి సహకరించండి. రాజధానికి భూమిలిచ్చిన రైతులుగా మీపై అభిమానం కృతజ్ఞత ఉన్నాయి" అని సీఎం చెప్పారు.

పారదర్శకంగా రాజధాని నిర్ణయాలు

అమరావతిలో ప్రతి సమస్యను తీర్చడానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని సీఎం చంద్రబాబు చెప్పారని.. అమరావతి రాజధాని ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎంతో భేటీ అనంతరం రాజధాని రైతులు పలువురితో కలిసి పువ్వాడ సుధాకర్ మీడియాతో మాట్లాడారు. అమరావతి రాజధానిపై తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉంటుందని సీఎం చెప్పారన్నారు. సుమారు గంటన్నర సమావేశంలో తమలోని అపోహలు, భయాందోళనలను సీఎం తొలగించే ప్రయత్నం చేశారన్నారు. అధికారుల ద్వారా ఎవరికైనా అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, దాన్ని సత్వరమే పరిచేస్తానని, కావాలని అమరావతి రాజధాని మహాయజ్ఞానికి ఎవరైనా భంగం కలిగిస్తే.. చూస్తూ ఊరుకోమని సీఎం స్పష్టం చేశారని చెప్పారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కూడిన కమిటీ ప్రతి నెలా రాజధాని రైతుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తుందన్నారు. ప్రతి మూడు నెలలకోసారి అమరావతి రైతులు, రైతు ప్రతినిధులతో మాట్లాడతానని సీఎం చెప్పారని పేర్కొన్నారు. త్రిసభ్య కమిటీ ప్రతి నెలా సమావేశం అవుతుందన్నారు. గ్రామ కంఠాల పరిశీలన కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి.. సర్వే చేసి పరిష్కరిస్తామని చెప్పారన్నారు. నెలరోజుల్లో కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం గ్రామ కంఠాలను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. పరిష్కరించదగ్గ సమస్యలన్నింటినీ త్రీమెన్ కమిటీ పరిష్కరిస్తుందని తెలిపారన్నారు.

22 రకాల సమస్యలను వివరించాం

సీఎం చంద్రబాబుకు 22 రకాల సమస్యలు వివరించామని రాజధాని రైతు అప్పారావు తెలిపారు. రైతుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఇబ్బందులు కలగనీయమని సీఎం హామీ ఇచ్చారన్నారు. నెలరోజుల్లో త్రీమెన్ కమిటీ పరిష్కరిస్తుందన్నారు. ఎటువంటి అన్యాయం జరగనివ్వనని సీఎం చెప్పారన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులందరూ చంద్రబాబు తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని స్వాగతిస్తామని, ఆమోదిస్తామని చెప్పినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేస్టేషన్, క్రికెట్ స్టేడియం, ఇంకా ఏదైనా పరిశ్రమలు రావాలంటే కొంత భూమి అవసరం అవుతుందని సీఎం చెప్పారన్నారు. హైద్రాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని అదే జరిగితే ఓ మున్సిపాలిటీగా మాత్రమే అమరావతి ఉంటుందని సీఎం చెప్పారన్నారు. అమరావతి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే వృద్ధి చెందాలంటే తాను తీసుకునే నిర్ణయాలకు రైతుల మద్దతు కావాలని సీఎం కోరారన్నారు. రాజధాని అభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే విధంగా ఇక్కడ ఏ సంస్థలు వస్తే బాగుంటుంది, రైతులకు ఏ విధంగా ఆదాయం సమకూరుతుందో దానికి అవసరమైతే ల్యాండ్‌పూలింగ్ తీసుకోవడానికి సిద్ధంగానే ఉంటామని సీఎం స్పష్టంగా చెప్పారన్నారు.

రుణాల కోసం విన్నవించాం

క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ రెండేళ్ల మినహాయింపు అడగడంతో.. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడి చేస్తామని సీఎం సమాధానమిచ్చారని రైతు ఇడుపులపాటి సీతారామయ్య తెలిపారు. గుంటూరు, విజయవాడ కంటే అమరావతిలో ఏఎస్‌ఐ కొంచెం పెంచమని అడిగామన్నారు. కమర్షియల్ ప్లాట్, రెసిడెన్షియల్ ప్లాట్లు పరిశీలించి చేస్తామన్నారు. న్యాయబద్ధంగా ఉన్న గ్రామ కంఠాలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్‌పై రుణాలకు 30 ఏళ్ల లింక్ డాక్యుమెంట్స్ బ్యాంకుల్లో అడుగుతున్నారని.. అలా లేకుండా లోన్ ఇచ్చేలా చూడాలని సీఎంను కోరామని రాజధాని రైతు ఇడుపులపాటి సీతారామయ్య తెలిపారు.

రైతులను మోసం చేసిన వైసీపీ సర్కార్

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయని రైతు ద్రోహి జగన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మండలంలోని గణపవరం గ్రామంలో రైతన్నా నీ కోసం కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాల ఎదుట రూ.10 లక్షల వ్యయంతో మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన ధరల స్థిరీకరణ కోసం విపత్తు నిధితో రైతులను ఆదుకుంటానన్న జగన్.. తన నిధిని మాత్రం బాగా పెంచుకున్నారని ఆరోపించారు. అధికారం కోసం రైతులను వాడుకున్న జగన్ వారిని మోసగించిన ఏకైక నాయకుడిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందించాలని, గిట్టుబాటు ధర కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మునిసిపల్ చైర్మన్ రఫానీ, ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, డైరెక్టర్ కందుల రమణ, సొసైటీ అధ్యక్షుడు పెంటాల శేషయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని.. దానిలో భాగంగా రైతన్నా మీ కోసం కార్యక్రమం తీసుకొచ్చిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి అప్పులు అధికంగా ఉన్నా సరే వాటిని అధిగమించి రైతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు కేంద్రప్రభుత్వం ఇచ్చే సాయంతో కలిపి అందిస్తున్నామన్నారు. రైతులు అధిక దిగుబడి సాధించాలని, అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలన్న ఉద్దేశంతో.. రైతులకు అవగాహన కల్పించేందుకు.. కూటమి ప్రభుత్వం రైతన్నా.. మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



వెంకటేష్ యాదవ్ (ఫైల్‌ఫోటో)

విజయపురిసౌత్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు మర్రి వెంకటేష్ యాదవ్ (32) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్ యాదవ్ మూడేళ్లుగా 5 ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిరప పంటలు సాగు చేశాడు. పంట దిగుబడి ఆశించిన మేర రాకపోవడం, రూ.12 లక్షలు అప్పులు కావడంతో మనస్తాపానికి గురై మాచర్ల పట్టణ శివారులోని గొర్రెల మండి సమీపంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేష్ యాదవ్‌ను కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మాచర్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితులకు యావజ్జీవం

కారంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురజాల పదో అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని గురువారం తీర్పునిచ్చారు. మండలంలోని పేటసన్నిగండ్లకు చెందిన చప్పిడి వెంకటేశ్వర్లు, సోదరుడు మల్లయ్య కుమారులు చప్పిడి అంజయ్య, శంకర్, నరసింహారావు, అయ్యప్పల మధ్య 2.50 ఎకరాల భూవివాదం నెలకొంది. 2016 జూలై 19న చప్పిడి వెంకటేశ్వర్లు తన కుమారుడు వెంకటనరసయ్య, చిన్న కుమార్తె ఆదిలక్ష్మి, కూలి ఏసురత్నంతో కలిసి పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు అన్న మల్లయ్య కుమారులు అంజయ్య, శంకర్, నరసింహారావు, అయ్యప్పలు తమ ట్రాక్టర్‌తో పొలానికి వెళ్లి వెంకటేశ్వర్లు, అతని కుమారుడు వెంకట నరసయ్యతో గొడవపడి గొడ్డలి, వేట కొడవళ్లతో దాడి చేశారు. వెంకట నరసయ్యపై విచక్షణా రహితంగా దాడి చేసి.. తలను శరీరం నుంచి వేరు చేశారు. తన కుమారుడిని రక్షించుకోవాలనే ఆత్రుతతో అడ్డుకోబోయిన వెంకటేశ్వర్లును శంకర్ వేట కొడవలితో వీపుపై నరికాడు. ప్రాణభయంతో వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, ఏసురత్నం అక్కడి నుంచి పారిపోయారు. వెంకటేశ్వర్లు పోలీసులకు జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. అప్పటి కారంపూడి ఎస్‌ఐ టి.నారాయణస్వామి కేసు నమోదు చేశారు. గురజాల సీఐ అలహరి శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. 2016 ఆగస్టు 8న నిందితులను అరెస్ట్ చేసి గురజాల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో చార్జి షీటు దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యరాజు వాదనలతో ఏకీభవించిన జిల్లా కోర్టు నాలుగో నిందితుడు చప్పిడి అయ్యప్ప ఈ నెల 17న కాలువలో పడి మృతిచెందడంతో మిగిలిన ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 1000 జరిమానా విధించారు. రెండో నిందితునికి పదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం

విజయపురిసౌత్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 582.00 అడుగులు ఉంది. ఇది 288.78 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500, ఎడమ కాలువ ద్వారా 3972, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో 15,272 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 15,272 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

రేపటి నుంచి పల్నాడు బాలోత్సవం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో 3వ ప్రతిష్ఠాత్మక పిల్లల పండుగ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్నాయి. స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల వేదికగా జరిగే ఈ సాంస్కృతిక పోటీల్లో జిల్లా నుంచి రెండు వందల పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు గురువారం తెలిపారు. మొత్తం 69 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 5 వేదికలపై ఏకకాలంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కోలాటం, శాస్త్రీయ నృత్యం, బుర్రకథ, విచిత్ర వేషధారణ వంటి అంశాలు బాలోత్సవంలో ప్రధాన ఆకర్షణ ఉంటాయన్నారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ కేటగిరిలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొంటున్నట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

హస్నాబాద్ తండాలో కార్డెన్ సెర్చ్

విజయపురిసౌత్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం హస్నాబాద్ తండాలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యాన గ్రామంలో తనిఖీలు జరిపారు. సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నఫీజ్ బాషా తెలిపారు. గృహాల్లో దాచి ఉంచిన 16 గొడ్డళ్లు, 14 కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఎక్సైజ్ కేసుల్లో ఇద్దరు పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మాచర్ల పట్టణ సీఐ వెంకటరమణ, ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, ప్రొబేషన్ ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో ఏడాది జైలు

యడ్లపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళను వేధింపులకు గురిచేయడం, బెదిరించడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి న్యాయ స్థానం ఏడాది జైలు శిక్ష విధించింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వంకాయలపాడు గ్రామానికి చెందిన మహిళను రోడ్డుపై వేధించడంతో.. నిందితుడు షేక్ కరిముల్లాకు చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి కె.నరేంద్రరెడ్డి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.3వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. 2020 అక్టోబరు 30న అప్పటి ఎస్ఐ డి.శ్రీహరి కేసు నమోదు చేయగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.మహేంద్రనాథ్ వాదనలు వినిపించారు.

'అమరావతి' వేళల్లో స్వల్ప మార్పు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు మీదగా ప్రయాణించే 17225 నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికను ఈ నెల 30 నుంచి రైల్వే శాఖ స్వల్పంగా సవరించింది. ఈ రైలు ప్రస్తుతం గుంటూరుకు రాత్రి 9 గంటలకు వచ్చి 9.05కి బయలుదేరుతుండగా ఆదివారం నుంచి రాత్రి 9.05కి వచ్చి 9.10కి బయలుదేరుతుంది.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

గృహ యజమానులకు రిజిస్ట్రేషన్ శాఖ నోటీసులు

పిడుగురాళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో గృహ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్లు, స్థలాలకు, పొలాలకు సంబంధించి వాల్యూయేషన్ను తక్కువ చూపించి రిజిస్టర్ చేయించుకున్న దస్తావేజు దారులకు రిజిస్ట్రేషన్ శాఖ నోటీసులు పంపిస్తున్నారు. ముఖ్యంగా పిడుగురాళ్ల పట్టణంలో పలు ప్రాంతాలలో విస్తారంగా వెలసిన ప్లాట్లు, నిర్మాణంలో వున్న, పూర్తయిన అపార్ట్‌మెంట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వాస్తవంగా వున్న డోర్ నెంబరు కాకుండా వేరే డోర్ నెంబరు వేసి ప్రభుత్వానికి ఛలానాను తక్కువ చెల్లించి రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ దస్తావేజులను రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల తనిఖీలలో గుర్తించారు. ఇలా గత మూడేళ్లుగా తక్కువ ఛలానా చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న యజమానుల వివరాలను ఆ శాఖ గుర్తించి వారి నుండి సుమారు రూ.కోటి వరకు చెల్లించాల్సిన అదనపు ఛలానాను చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారులు స్థానిక రిజిస్ట్రేషన్‌శాఖ అధికారుల ద్వారా ఆస్తి యజమానులకు నోటీసులు పంపిస్తున్నారు.



తంగెడ మేజరు కాల్వను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ టీ రమేష్, డీఈఈ పీ ఆదినారాయణ తదితరులు

తంగెడ మేజరు కాలువ పరిశీలన

దాచేపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తంగెడ మేజరు కాలువను మాచర్ల ఇరిగేషన్ శాఖ ఈఈ టీ రమేష్, డీఈఈ పసుపులేటి ఆదినారాయణలు పరిశీలించారు. కాలువలో దిగువన ఉన్న రైతులకు సాగునీరందటం లేదన్న సమాచారంతో అధికారులు కాల్వను పరిశీలించారు. కాల్వలో జమ్ము, నాచు, గుర్రపు డెక్క, కంప అధికంగా ఉండటంతో దిగువున్న రైతులకు నీరందటం లేదని, త్వరగా నాచును తొలగిస్తామని అధికారులు వివరించారు. డీసీ చైర్మన్ పగడాల భాస్కరరావు, వైస్‌చైర్మన్ పాశం చిన వెంకటరెడ్డి, జేఈ దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పురుషులతో పాటు స్త్రీలనూ గౌరవించాలి

మాచవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పురుషులతో పాటు స్త్రీలను కూడా గౌరవించాలని, అప్పుడే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయా రజిని అన్నారు. గురువారం మాచవరంలోని కుటుంబ న్యాయసలహా కేంద్రంలో జెండర్ ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కే బాలస్వామి, పోలీసు సిబ్బంది, సీసీలు కే నాగరాజు, ఎం సుభానీ, చంద్రయ్య, వీవోఏలు, ఎస్ఎస్‌జీ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పిడుగురాళ్ల: ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం పిడుగురాళ్లలోని బీడీల చెన్నయ్య కాంప్లెక్స్‌లో రాష్ట్ర మహాసభలపై సమావేశం నిర్వహించారు. డిసెంబరు 8, 9 తేదీలలో గుంటూరులో జరిగే ఏఐఎఫ్‌టీయూ రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై రాష్ట్ర కార్యదర్శి జాస్తి కిషోర్‌బాబు, కోశాధికారి డీవీ స్వామి, రాష్ట్ర సహాయకకార్యదర్శి యు.నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఎన్.రాంబాబు తదితరులు మాట్లాడారు.

హెచ్ఐవీపై అవగాహన

ప్రపంచ హెచ్ఐవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద స్టాల్‌ను ఏర్పాటుచేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రమాదేవి స్టాల్‌ను ప్రారంభించి ప్రతిఒక్కరు హెచ్ఐవీ గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ నాగరాజు, ఎల్‌టీ జయలక్ష్మి, కోమలి, శేషయ్య పాల్గొన్నారు.

బాలికలకు కళ్లజోళ్ల పంపిణీ

నకరికల్లు: నకరికల్లులోని కేజీబీవీలో గురువారం ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి ఫీల్డ్ అసిస్టెంట్ వినయ్‌కుమార్ బాలికలకు ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈనెల 10వ తేదీన ఆస్పత్రి ద్వారా బాలికలకు ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్లు అవసరమైనవారికి పంపిణీచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కే లక్ష్మీ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్‌కు నకరికల్లు హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 ఖోఖో పోటీలకు నకరికల్లు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు తెలిపారు. స్వర్ణ రామ్‌చరణ్, పఠాన్ షాహీన, షేక్ ఫర్హానా, సిద్ది హేమ శివవర్షిణి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 28నుంచి 30వ తేదీవరకు అనకాపల్లి జిల్లా లంకలపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ జీ ఝాన్సీరాణి, పీ రాజు, ఎస్ఎంసీ చైర్మన్ కె.మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

వర్సిటీకి ఎస్‌వీఆర్ కళాశాల విద్యార్థిని ఎంపిక

సత్తెనపల్లి: పట్టణంలోని ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని ఎం మహేశ్వరి ఈనెల 26న ఒంగోలు స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన కుస్తీ పోటీల్లో ప్రథమస్థానం సాధించి యూనివర్సిటీకి ఎంపికైందని కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు గురువారం విలేకర్లకు తెలిపారు. మహేశ్వరిని కళాశాల నిర్వాహకులు వీరవల్లి సుజాత, శ్రీనివాసరావు, మురళీకృష్ణ సత్కరించారు.

బాలికలకు అవగాహన

పట్టణంలోని వేద కళాశాలలో జీఎన్ఎం పారా మెడికల్ చదువుతున్న విద్యార్థినిలకు గురువారం హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ విజయకుమార్, కే బుల్లిబాబు, మాలతి తదితరులు పాల్గొన్నారు.

సర్వేతో వ్యాధుల నిర్ధారణ

రాజుపాలెం: కుష్ఠు, క్షయ వ్యాధుల నిర్ధారణపై ఆరోగ్యశాఖ సిబ్బంది అన్ని గ్రామాలలో సర్వే చేపడుతున్నట్లు మండల వైద్యాధికారి రవితేజనాయక్ తెలిపారు. గురువారం మొక్కపాడులో ఆశ, ఆరోగ్య కార్యకర్తలు సర్వేచేసే విధానాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్య పరిస్థితులను ఆరా తీస్తున్నారన్నారు. వారిలో జలుబు, దగ్గు, ఆయాసం లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స అందించేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్ళచెరువు రెవెన్యూలోని జాయింట్ సర్వే

అచ్చంపేట: మండలంలోని తాళ్ళచెరువు గ్రామ రెవెన్యూ పరిధిలో గల 321 సర్వే నెంబరులోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన భూములపై గురువారం ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, డీఆర్వో కుసుమకుమారి జాయింట్ సర్వే నిర్వహించారు మరికొన్ని రికార్డులు పరిశీలించాలని వారు రైతులకు తెలిపారు.

వైభవంగా సాయిబాబా ఆలయ ప్రతిష్ఠ

బెల్లంకొండ: మండలంలోని వన్నాయపాలెంలో గురువారం సాయిబాబా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మద్దిబోయిన సావిత్రమ్మ ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, రాష్ట్ర వైసీపీ ప్రధానకార్యదర్శి చెన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చెన్నపరెడ్డి పద్మ పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జానీ మృతి

పెదకూరపాడు: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ జానీ(78) గురువారం వారి గృహంలో మృతి చెందారు. పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మాచర్ల అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి

● ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు



మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మాచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద మాచర్ల, రెంటచింతల, గురజాల పట్టణాలకు ఇన్నర్ బైపాస్ రోడ్డు నిర్మాణాలకు వారు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, యాగంటి మల్లిఖార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజబోయిన మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్, కజ్జం సైదయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ యర్రాకుల సిద్ధమ్మ సిద్దయ్య యాదవ్, మాచర్ల వాసు, కొమెర దుర్గారావు, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, సంబోజు వేణు, కుర్రి శివారెడ్డి, కళ్లం రామాంజిరెడ్డి, కుమార్, ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మాచర్ల పట్టణాభివృద్ధికి రూ.252.31 కోట్లు మంజూరు

మాచర్ల పట్టణాభివృద్ధికి ప్రభుత్వం సుమారు రూ.252.31 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణాభివృద్ధికి మంజూరైన నిధుల వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. రాయవరం జంక్షన్ నుంచి రింగు రోడ్డు వరకు నేషనల్ హైవే నిర్మాణంకు రూ.54కోట్లు, మంచినీటి సరఫరాకు రూ.124కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి డీఎంఎఫ్ గ్రాంటు రూ.4కోట్లు, బీపీఎస్ గ్రాంటు రూ.3కోట్లు, సైడు కాలువల నిర్మాణానికి రూ.45లక్షలు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.6.86కోట్లు, అగ్రికల్చర్ మార్కెట్‌యార్డు షాపిం గ్ కాంపెక్స్ నిర్మాణానికి రూ.3కోట్లు, మంచినీటి చెరువు అభివృద్ధికి రూ.6కోట్లు, వినాయకునిగుట్టలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.కోటి, పట్టణాభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు చేసిందన్నారు.

మోసిన్ సామాజిక సేవలు ప్రశంసనీయం

మాచర్ల రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగు యువత మాజీ అధ్యక్షుడు షేక్ మోసిన్ సేవలను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు ప్రశంసించారు. గురువారం పట్టణానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా వీధి వ్యాపారం చేసుకునే ఇరు కుటుంబాలకు ఉచితంగా తోపుడు బండ్లను అందజేశారు. మంత్రి లోకేశ్ స్ఫూర్తితో తోపుడు బండ్లను పేదలకు ఉచితంగా మోసిన్ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, మార్కెట్ యార్డు చైర్మన్ ఆర్.మధు, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, కళ్లం రామాంజిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ నేత షేక్ అన్వర్ బాషా, చింతపల్లి ముజుఫర్, బొల్లెద్దుల శివ తదితరులు పాల్గొన్నారు.

మా భూములను రక్షించండి

దుర్గి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో తమ భూములను ఆక్రమిస్తున్నారని, వాటిని కాపాడాలని ఆ గ్రామ ఎస్సీ వర్గీయులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కోరారు. గురువారం మాచర్ల వస్తున్న ఎంపీని మార్గ మధ్యంలోని దుర్గి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మేకల అనిల్ ఆధ్వర్యాన వారు కలిసి తమ సమస్యపై అర్జీ అందించారు. అడిగొప్పులలో 2008లో ఎస్సీలకు భూపంపిణీలో భాగంగా సుమారు 100 మందికి 200 ఎకరాలను ప్రభుత్వం అందించి పాసు పుస్తకాలను మంజూరు చేసిందన్నారు. కొందరు వ్యక్తులు ఈ భూములను ఆక్రమిస్తున్నారన్నారు. ఎంపీ సూచన మేరకు వారు గురజాల ఆర్డీవోను కలిసి అర్జీ అందించారు.

దివ్యాంగుడి పింఛన్ సమస్య పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడి పింఛన్ సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని కస్తల గ్రామంలో ప్రజల వద్దకు ప్రవీణ్ వంద రోజులు వంద గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా 1995 నుంచి కస్తలలో పింఛన్ పొందుతున్న 90శాతం దివ్యాంగుడైన కంఠమనేని లక్ష్మీనారాయణకు 2022లో పింఛన్ నిలిపివేశారు. తక్షణమే పింఛన్ సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కస్తలలో జరిగిన కార్యక్రమంలో 44 సమస్యలు రాగా వాటిలో పది గ్రామ అభివృద్ధి కొరకు, ఐదు రెవెన్యూ, మిగిలినవి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, విడో పింఛన్, హౌసింగ్ తదితర వాటిపై దరఖాస్తులు వచ్చాయి. రూ.36 లక్షలతో నిర్మించనున్న హెల్త్ సెంటర్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

నేడు వన్నాయపాలెంకు ఎమ్మెల్యే రాక

బెల్లంకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని వన్నాయపాలెం గ్రామానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వందరోజులు వంద గ్రామాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి తెలిపారు.

విజయవాడ రోడ్డు పునర్నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) అమరావతి-విజయవాడ మార్గంలో వైకుంఠపురం వరకు రహదారి పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6కోట్లు మంజూరుచేసినట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. బీటీ రోడ్‌ను నిర్మించేందుకు ఎమ్మెల్యే కృషితో ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసింది.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

2న అరుణాచలానికి బస్సు సర్వీసు

సత్తెనపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 2వ తేదీన సత్తెనపల్లి నుంచి అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ విజయ కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. బస్సు 2వ తేదీ రాత్రి సత్తెనపల్లిలో బయలుదేరి 3వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అదేరోజు రాత్రికి అరుణాచలం చేరుతుందని, దర్శనం అనంతరం 4వ తేదీ కంచికి చేరి దర్శనం అనంతరం బయలుదేరి 5వ తేదీ ఉదయం సత్తెనపల్లి చేరుతుందన్నారు. రానుపోను టిక్కెట్ ధర రూ2500 అని తెలిపారు. సత్తెనపల్లి పరిసర ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

గురజాల తిరునాళ్లపై సమీక్ష



సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి 427వ తిరునాళ్ల డిసెంబరు 4వ తేదీన జరగనుండడంతో గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మురళీకృష్ణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో తిరునాళ్లను విజయవంతం చేయాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులపై నగర పంచాయతీ అధికారులు శ్రద్ధచూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గేశ్వరరావు, కమిషనర్ శివన్నారాయణ, ఈవో పూర్ణచంద్రరావు, సీఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు ఆధార్ ప్రక్రియ

పిడుగురాళ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వలసకార్మికులు ఉండే లెనిన్‌నగర్‌లో తల్లిదండ్రులు లేని కొంతమంది చిన్నారులు సమీప బంధువుల సాయంతో పాఠశాలకు వెళ్తున్నారు. సుమారు 25 మంది ఇటువంటి విద్యార్థులకు ఆధార్‌కార్డు అత్యవసరమైంది. పాఠశాలలో ఆధార్‌కార్డు తప్పనిసరి చేయడంతోపాటు కొందరికి స్కూల్ రికార్డులో, ఆధార్‌కార్డులో పేర్లు వేర్వేరుగా వున్నాయి. వాటిని సరిదిద్దుకునే స్థోమత వారికిలేకపోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని తనయుడు నిఖిల్ వారికి ఉచితంగా ఆధార్‌కార్డును గురువారం లెనిన్‌నగర్‌లోని క్యాంప్‌లో ఇప్పించారు. తహసీల్దార్ మధుబాబు, పిల్లి చెన్నారావు, మల్లెల ఆదినారాయణ, పఠాన్ ఖాశిం, సైదా పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

పెదకూరపాడు: మండలంలోని 75 తాళ్ళూరు జడ్పీహైస్కూల్ విద్యార్థులు పెదకూరపాడులోని యూనియన్ బ్యాంక్‌ను సందర్శించారు. బ్యాంకు పనితీరు, లావాదేవీలపై మేనేజర్ ప్రసాదు వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఇన్‌స్పెక్టర్ ఖాసీదా, సునీత, పీఈటీ చెన్నకేశవుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కోతుల బెడదను నివారించండి

● సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణు చిరంజీవి

మాచవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మాచవరంతో పాటు మిగిలిన గ్రామాల్లో కూడా కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని, వాటిని నివారించాలని సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో వీధుల వెంట కోతులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. మాచవరం ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరిందని, దానికి మరమ్మతులు చేయించి మినీ లైబ్రరీ ఏర్పాటుచేయాలని సర్పంచ్ నరేష్ కోరారు. మాచవరంతోపాటు పలు గ్రామాల్లో భూ రీసర్వే జరిగిందని, దీనిపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు సూచించారు. ఇటీవల మృతిచెందిన ఎంపీపీ దారం అంబులమ్మ మృతికి సభలో శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత మండల స్థాయి అధికారులు వారి శాఖల సమాచారాన్ని సభలో చదివి విన్పించారు. ఎంపీడీవో చిరంజీవి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు పంచాయతీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్ లైసెన్స్‌ను నోటీసు బోర్డులో అంటించాలి

● జిల్లా రవాణా అధికారి సంజీవ కుమార్



బస్సులను తనిఖీ చేస్తున్న జిల్లా రవాణా అధికారి సంజయ్ కుమార్, గురజాల డీఎస్పీ జగదీష్

దాచేపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లు వారి లైసెన్స్‌లను బస్సు లోపల నోటీసు బోర్డులో అతికించాలని పల్నాడు జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవకుమార్ స్పష్టం చేశారు. గురువారం నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. ప్రధానంగా హ్యాండ్ బ్రేక్‌లు, ఎమర్జెన్సీ డోర్‌లు, ఫైర్ సిలిండర్లు, బస్సుకు నాలుగు వైపుల సిగ్నల్ లైట్లను పరిశీలించారు. గురజాల డీఎస్పీ జగదీష్ వివరిస్తూ బస్సులో సీటింగ్ పరిమితికి మించి పిల్లలను ఎక్కించరాదన్నారు. ప్రతి స్కూల్ బస్సుకు అటెండర్ ఉండాలని వివరించారు. ప్రతి బస్సుకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ ఉండాలని ఆదేశించారు. ఫస్ట్ ఎయిడ్ బాక్సులు బస్సులో ఉంచాలని సూచించారు. మాచర్ల బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి, గురజాల సీఐ భాస్కరరావు, దాచేపల్లి ఎస్ఐ పాపారావు 55 బస్సులను తనిఖీ చేశారు.

బస్సుల తనిఖీలపై ఎస్ఎఫ్ఐ విమర్శలు

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం స్కూల్ బస్సుల తనిఖీలపై ఎస్ఎఫ్ఐ దాచేపల్లి మండల శాఖ కార్యదర్శి విక్రమ్ పలు ఆరోపణలు చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాఠశాల బస్సుల డాక్యుమెంట్లు, బస్సుల కండిషన్ తనిఖీలు అధికారులు మొక్కుబడిగా నిర్వహించారని విమర్శించారు. ఎన్ని బస్సులను అన్‌ఫిట్‌గా నిర్ధారించారో అధికారులు బహిర్గతపరచాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.

ఎడ్ల పందేల గ్రౌండ్ పరిశీలన

గురజాలటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా గురజాల రైతు సంఘం ఆధ్వర్యాన ఎడ్ల బండ లాగు పోటీలను నిర్వహించనున్న పులిపాడు రోడ్డులోని గ్రౌండ్‌ను గురువారం కూటమి నేతలు పరిశీలించారు. డిసెంబరు 5 నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. తెలుగు రాష్ట్రాల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నవులూరి శ్రీరామ్మూర్తి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసగించిన వారిపై కేసు నమోదు

పెదకూరపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేశారనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ గిరిబాబు గురువారం తెలిపారు. జలాలపురం గ్రామానికి చెందిన తిమ్మిశెట్టి శివ కోటేశ్వరరావు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నడుపుతున్నాడు. అక్కడే రైజ్ టెక్ సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కన్సల్టెంట్‌లు షేక్ ఆసిస్ బాషా, అల్లం దామోదర్‌లు తన వద్ద చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.16.80లక్షలు తీసుకున్నారని, వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసినట్టు పేర్కొన్నారు. తిరిగి డబ్బులు అడగటంతో చంపుతామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సరికొండ వెంకటేశ్వరరాజు గురువారం గుంటూరులో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రులు అనగాని సత్యప్రసాదు, సవితలను ఆయన కలసి కృతజ్ఞతలు తెలిపారు. - సత్తెనపల్లి







గురజాలలో చేనేత హస్తకళ మేళా

గురజాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల శ్రీనివాస ఫంక్షన్ హాలులో గురువారం చేనేత హస్తకళ ప్రదర్శన నిర్వహించారు. ఈ మేళాను గురజాల సీఐ భాస్కర్ ప్రారంభించి మాట్లాడుతూ చేనేత, హస్తకళ వస్తువులను కళాకారులే నేరుగా అమ్మకాలు జరుపుతున్నారని, వారిని ప్రజలు ప్రోత్సహించాలని కోరారు. డిసెంబర్ 11వ తేదీ వరకు అమ్మకాలు జరుగుతాయని నిర్వాహకుడు రంగస్వామి తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బెల్లంకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సునీత పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహిస్తారని, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

పేదల సొంతింటి కల సాకారం కావాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



గృహ నిర్మాణ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి సొంతిల్లు ఉండేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘు రామ్ నగర్ ప్రజావేదికలో గురువారం 120మంది లబ్ధిదారులకు పీఎంఏవై, నూతన గృహాల నిర్మాణానికి మంజూరు పత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన ఇళ్ళ నిర్మాణం జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2029 నాటికి ప్రతి అర్హుడికి పక్కా ఇల్లు ఇవ్వటమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఇళ్ళు లేని పేదలందరినీ గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకరిస్తా

● ఎమ్మెల్యే యరపతినేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రజక సామాజికవర్గ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకరిస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పార్టీలకు అతీతంగా పట్టణానికి చెందిన ఐలమ్మ రజకసంఘం సభ్యులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిశారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకరించాలని కోరగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తనవంతు సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో పిల్లి చెన్నారావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, తురకా వీరస్వామి, కనిగిరి శ్రీను, రజక సంఘం అధ్యక్షులు విప్పర్ల నరసింహారావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● నాగార్జునసాగర్ కుడి కాలువ చైర్మన్ కాంతారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంతారావు

గురజాలటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నాగార్జునసాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. గురువారం మండలంలోని పల్లెగుంత గ్రామంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం హెల్త్‌క్లినిక్ భవననిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, మద్దినేని లక్ష్మీనారాయణ, జాస్తి ప్రకాష్, వీరనారాయణ, బత్తుల మల్లారెడ్డి, ఏవో పుల్లారెడ్డి పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్, సర్జన్‌ను నియమించాలి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి



మంత్రి అచ్చన్నాయుడుతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి

నకరికల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుంకలగుంట గ్రామీణ పశువైద్యశాలను అప్‌గ్రేడ్ చేసి ప్రభుత్వపశు వైద్యశాలగా మార్పు చేయాలని, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ హోదాగల వైద్యుడిని నియమించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కే అచ్చన్నాయుడును కోరారు. గురువారం అచ్చన్నాయుడును కలసిన బాజీచౌదరి చల్లగుండ్ల, కుంకలగుంట గ్రామాల్లో పశు వైద్యశాలను కొత్త భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. కుంకలగుంట, చేజర్ల గ్రామాలకు ప్రభుత్వ పశువైద్యశాలను ఏర్పాటుచేయాలని కోరినట్టు వివరించారు. మండలానికి అదనంగా పశుగ్రాసం, పశుదాణా కేటాయించాలని కోరినట్టు తెలిపారు. రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు.

వాటర్ గ్రిడ్ పనులు పరిశీలన

రెంటచింతల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామాల గృహాల వారికి కృష్ణానది నీటిని అందించేందుకు వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయించిందని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ టి.చంద్రశేఖర్ చెప్పారు. గురువారం గోలి గ్రామంలో రూ.40లక్షలతో 60వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మితమౌతున్న ఓహెచ్ఆర్ పనులను పరిశీలించారు. అలాగే రూ.40 లక్షలతో మిట్టగుడిపాడు,రూ.50లక్షలతో జెట్టిపాలెంలో ఓహెచ్ఆర్ పనులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. రెంటచింతల ఆనందపేటలో రూ.84.50 లక్షలతో జరుగుతున్న వాటర్ ట్యాంక్ పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈ వి.కాశిరెడ్డి, ఏఈ వెన్ను వెంకటేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కోకా శ్రీనివాసరావు, టీడీపీ నేతలు కె.వీరాంజనేయులు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నూతన గృహాలకు నమోదు చేసుకోండి: హౌసింగ్ ఏఈ

రెంటచింతల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై కింద ప్రభుత్వ గృహ నిర్మాణ పథకానికి అర్హులైన పేదలు తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ సి.శ్రీనివాస్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30తో గడువు ముగుస్తున్నందున ఇల్లు కావాల్సిన వారు గమనించాలన్నారు. అర్హులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

గురజాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు గురువారం సీఐ భాస్కర్, మోటారు వెహికల్ అధికారి శేషురెడ్డి చర్యలు చేపట్టారు. పట్టణ శివారులో ప్రమాదాలు జరుగుతున్న చోట బ్లాక్ స్పాట్స్‌లో తీసుకున్న చర్యలపై పరిశీలించారు. అలాగే వాగ్దేవి కళాశాల మూలమలుపు వద్ద లైటింగ్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నారు.

ప్రకృతి సాగు పొలం పరిశీలన



మిరపపంటను పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

పెదకూరపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న మిర్చిపంటలను ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి గురువారం పరిశీలించారు. అభ్యుదయ రైతు దర్శి శేషారావు మిరపపంటను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రసాయన వ్యవసాయం చేసే మిరపపంటను పరిశీలించి పైరులో అంతర్‌పంటలు వేసుకోవటం వల్ల అదనపు ఆదాయం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో మధుబాబు, అమూల్య, మహబూబీ తదితరులు పాల్గొన్నారు.


హోమ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు


దేవాలయ నమూనా గ్యాలరీని తిలకిస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీవారి చిత్తంతోనే.. అమరావతి

(3వ పేజీ తరువాయి)

చేస్తున్నామని చెప్పారు. అమరావతినే కాకుండా, ఈ ప్రాంతాన్ని కాపాడే శక్తి ఈ దేవాలయానికి ఉందన్నారు. గత ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన సందర్భాలు లేవని, మంచి సంకల్పంతో రైతులు భూములు ఇస్తే నరకాన్ని చూపించారన్నారు. రైతులు వేంకటేశ్వరస్వామిని నమ్ముకుని న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు యాత్ర చేసి రాజధానిని కాపాడుకోవడానికి పోరాడారన్నారు. కార్యక్రమం లో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరి నారాయణ, నాదెండ్ల మనోహర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు జానకీదేవి, భానుప్రకాశ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పెద్ద సంఖ్యలో రాజధానిప్రాంత రైతులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు


కార్యక్రమానికి హాజరైన అభిమానులు, భక్తులు

కోడిగుడ్డు.. అధరహో



● హోల్‌సేల్‌లోనే రూ.6.40 ● చిల్లర దుకాణాల్లో ధర రూ.8

గుంటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కోడి గుడ్డు ధర అదరకొడుతోంది. గత నెలలో హోల్‌సేల్‌లో రూ.6 లోపు ఉన్న ధర క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.6.40కి చేరింది. ఒకవైపు కూరగాయల ధరలతో పాటు కోడి గుడ్డు ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు ఏమి తినాలోనని ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా మాంసాహార ప్రియుల తో పాటు ఇతర వర్గాలవారు కోడి గుడ్డు అంటే ఇష్టపడతారు. కొందరైతే నిత్యం ఆహారంలో కోడిగుడ్డును భాగం చేసుకుంటారు. నవంబరు మొదటి వారంలో 100 గుడ్ల ధర రూ.585 ఉండేది. క్రమంగా పెరుగుతూ అది రూ.660 వరకు చేరింది. ఇక విజయవాడ జోన్ నెక్ వారు శుక్రవారం ధర రూ.640గా ప్రకటించారు. కాగా గతంలో 30 గుడ్ల ట్రే రూ.180 నుంచి రూ.200 లోపు ఉండేది. ప్రస్తుతం పెరిగిన ధరతో 30 గుడ్ల ట్రే రూ.210 నుంచి రూ.220 వరకు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ ధరలు ఇలా ఉంటే చిల్లర దుకాణాల్లో రెండు గుడ్లు రూ.15, గుడ్డు రూ.8 అంటూ ఇష్టానుసారంగా వి క్రయిస్తు న్నారు. చలికాలం ప్రారంభంతో సహజం గానే కో డిగుడ్ల ఉత్పత్తి సాధారణం కంటే కొంత తక్కు వగానే ఉంటుందని పౌల్ట్రీ వర్గాలు తెలిపాయి. ఉత్పత్తి తగ్గడంతో పాటు ఇదే సమయంలో ఎగుమతులు పెరగడంతో కోడిగుడ్లకు డిమాండ్ పెరిగింది. ఈ కారణంగా ధరలు పెరిగా యని హోల్‌సేల్ వ్యాపారి యర్రబోతు వెంకటరమణ తెలిపారు. ఇవే ధరలు మరికొంత కాలం ఉండే అవకాశం ఉంటుందని పౌల్ట్రీ వ్యాపారులు తెలిపారు.

పరిశ్రమల భాగస్వామ్యంతోనే
పర్యావరణ పరిరక్షణ

● ఏపీ పీసీబీ చైర్మన్ కృష్ణయ్య

గుంటూరు(తూర్పు), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమలు భాగస్వామ్యం తప్పనిసరి అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు(ఏపీ పీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. ఇండస్ట్రీ పర్యావరణ పర్యవేక్షణ, సమీక్ష కార్యక్రమంలో భాగంగా గుంటూరులోని ఐటీసీ హోటల్, హిందుస్థాన్ రీసైక్లింగ్ హబ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఐటీసీ హోటల్లోని ఉత్పత్తి అయ్యే తడి వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు 200 కిలోల సామర్థ్యం కలిగిన ఆర్గానిక్ వేస్ట్ కంపోస్టింగ్ యంత్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ యంత్రం ద్వారా ఉత్పత్తి అయ్యే కంపోస్టును ప్రాంగణంలో ఎరువుగా వినియోగిం చడంతో పాటు, బయట నర్సరీలకు పంపిణీ చేస్తున్నట్లు చైర్మన్‌కు హోటల్ మేనేజ్‌మెంట్ వివరించింది. ఈ సందర్భంగా పర్యావరణహిత వ్యర్థ నిర్వహణ సమర్థంగా అమలు చేస్తున్నం దుకు మేనేజ్‌మెంట్‌ను అభినందించారు. అనంతరం హిందుస్థాన్ రీసైక్లింగ్ హబ్‌ను సందర్శించి వాహనాల రీసైక్లింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. తుక్కును పర్యావరణానికి హాని కలిగించకుండా, అనుబంధ పరిశ్రమల్లో వినియోగించి, విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చే అవకాశాలను అన్వేషించాలని మేనేజ్‌మెంట్‌కు చైర్మన్ సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు ఈ రెండు పరిశ్రమలు చేపట్టిన పర్యావరణ హిత కార్యక్రమాలు, వాటి నిర్వహణ విధానాలు గురించి జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం వివరించారు. అనంతరం ఈ రెండు పరిశ్రమల ఆవరణల్లో పి.కృష్ణయ్య, నజీనా బేగం మొక్కలు నాటారు. ఆయా పరిశ్రమల ఉద్యోగులు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ఏపీపీసీబీ చైర్మన్ పీ కృష్ణయ్య, పాల్గొన్న జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం



ఆర్టీసీ ప్రయాణికులకు చల్లనికబురు

ఏసీ సర్వీసుల్లో చార్జీలపై 10 శాతం రాయితీ
డిసెంబరు 1 నుంచి 20 వరకు అవకాశం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఏసీ సర్వీసులకు ప్రయాణికులను ఆకర్షించేందుకు సంస్థ ప్రయాణ చార్జీలపై 10 శాతం రాయితీ ప్రకటించింది. ఈ రాయితీ డిసెంబరు ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు అమల్లో ఉండనున్నది. అయితే ప్రయాణికులు రద్దీ ఉండే ఆదివారం రోజున రాయితీని మినహాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా బస్టాండ్ల నుంచి రాకపోకలు సాగించే ఇంద్ర, అమ రావతి ఏసీ సర్వీసులలో ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. రాయితీ చార్జీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు.

రాయితీ ధరలు ఇలా....

రూట్	సర్వీసు	పాత ధర	రాయితీ ధర
గుంటూరు టూ బీహెచ్‌ఈఎల్ వయా మిర్యాలగూడ	అమరావతి	870	790
గుంటూరు టూ బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ	అమరావతి	970	880
గుంటూరు టూ బీహెచ్‌ఈఎల్ వయా మిర్యాలగూడ	ఇంద్ర	700	640
తెనాలి టూ బీహెచ్‌ఈఎల్	ఇంద్ర	770	710
తెనాలి టూ విశాఖపట్నం	ఇంద్ర	960	880

పుడమి తల్లి రుణం తీర్చుకోవాలి

(3వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు ఇప్పుడు దారి తప్పుతున్నారని, వారు చెబితేనే ఏ పనైనే చేసేందుకు అధికారులు అలవాటు పడ్డారని, ఇటువంటి పరిస్థితుల్లో పేదలకు సంక్షేమం అందటం కష్టమవుతుందన్నారు. అమ్మ భాషను మర్చిపోయినవాడు అసలు మనిషే కాదన్నారు. సాటి మనిషికి సేవ చేయడం గొప్ప భాగ్యమని, దీనికి దుర్గా కమేశ్వరరావు ఒక ఆధునిక రుషిలా పాటుపడ్డారని కొనియాడారు. నేటి ప్రభుత్వాలు చేపలు పట్టడం నేర్పటం కాకుండా, ఏకంగా చేపలనే అందిస్తున్నారని, దీనివల్ల మనిషిలో నిపుణత తగ్గిపోతుందన్నారు. సోమరితనం పెరిగిపోయి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతుందన్నారు.

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దేశ విదేశాల్లో తెలుగు కీర్తిని పెంచిన వ్యక్తి వెంకయ్యనాయుడని, ఆయనను మాజీ ఉపరాష్ట్రపతి అంటే సరిపోదని, అపూర్వ ఉపరాష్ట్రపతి అని పిలవడం సముచితమన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రతిష్ఠను వెంకయ్యనాయుడు పెంచితే, సేవకు ప్రతిరూపంగా డాక్టర్ పీడీకే రావ్‌ను చెప్పుకోవచ్చన్నారు. సేవకుడిగా, పేదల పాలిట పెన్నిధిగా నిలిచిన కామేశ్వరరావు వంటి సేవా శిఖరాన్ని సత్కరించుకోవడం గొప్ప విషయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మట్లాడుతూ మాతృ దేశం, బాష కోసం పాటుపడే గొప్ప వ్యక్తి వెంకయ్యనాయుడు అయితే, పేదలకోసం పాటుపడటంలో ఒక వ్యక్తే మహోన్నత శక్తి అవుతుందన్న విషయాన్ని నిరూపించిన మహామనిషిగా కామేశ్వరరావు నిలుస్తారన్నారు. అటువంటి గొప్ప వ్యక్తికి తెనాలిలో పురస్కారం అందించుకోవడం గొప్ప భాగ్యంగా భావిస్తున్ననన్నారు. అవార్డు గ్రహీత కామేశ్వరావు మాట్లాడుతూ తను ఇంతటి పురస్కారానికి అర్హుడినో కాదో కానీ, తనకు నచ్చిన పని నేను చేసుకు వెళ్లానని, అది అందరికీ గొప్ప విషయంగా కనిపించడం గర్వంగా ఉదన్నారు. చీపురుపల్లి వంటి మారుమూల గ్రామాల్లో వెనుకబడిన వారు ఎదుర్కొంటున్న సమ్యలు, పేదరికం వంటివాటిపై తనవంతు సేవ చేశానన్నారు. సేవ చేసేటప్పుడు కూడా బెదిరింపులు, కేసులు తప్పలేదని, అన్నిటికీ తట్టుకుని తాను ఎంచుకున్న మార్గంలోనే నడిచానన్నారు. తన సేవలను గుర్తించి పురస్కారం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తన 84 ఏళ్ల జీవితంలో ఇది మరిచిపోలేని రోజన్నారు. సభలో హైకోర్టు న్యాయవాది ఇంద్రనీల్, రోటరీక్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావులు ప్రసంగించారు. ఓలేటి పార్వతీశం పరిచయ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, డబుల్ హార్స్ మినపగుళ్ల పరిశ్రమ అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్, చిత్రకారుడు గిరిధర్ పాల్గొన్నారు.


పురస్కారం అందుకున్నాక సభలో మాట్లాడుతున్న డాక్టర్ పీడీకే రావ్

నానో యూరియా

(3వ పేజీ తరువాయి)

అమ్మకాల బాధ్యతను డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్‌కు అప్పగించింది. ప్రస్తుతం జిల్లాలకు వస్తున్న యూరియా నిల్వల్లో 70 శాతం డీసీఎంఎస్, సొసైటీ లకు, 30 శాతం ప్రైవేట్ డీలర్లకు కేటాయిస్తున్నారు.

అక్కడ కూడా అదే గోల

డీసీఎంఎస్, సొసైటీల ద్వారా యూరియా అమ్మకాలు జరుపుతున్నప్పటికీ నానో యూరియా బాధలు రైతులకు తప్పడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో మూడు బస్తాలు యూరియా తీసుకుంటే ఒక లీటర్ నానో యూరియా తీసుకోవాలని ముడిపెట్టారు. రబీలో కూడా అదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. రానురాను ఘన యూరియా వాడకం తగ్గించి రైతులను ద్రవ నానో యూరియా వైపునకు మళ్లించాలని కేంద్రం ఆలోచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు మాత్రం నానో యూరియా వాడేందుకు పెద్దగా ఆసక్తి చూపించకపోవడంతో దాని కొనుగోలు వారికి భారంగా మారింది. ఒక వేళ నానో యూరియా తీసుకోకుంటే యూరియా ఇవ్వమని రైతుల ముఖం మీదే చెబుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

రూ. 250 వృథానే

నానో ఎరువులు తీసుకోకుంటే యూరియా ఇవ్వరన్న ఆలోచనతో రైతులు అవసరం ఉన్నా-లేకున్నా కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. మూడు యూరియా బస్తాల కోసం రూ.799.50 వెచ్చిస్తే, నానో యూరియా కోసం రూ. 250 వరకు చెల్లిస్తున్నారు. నానో ఎరువులను బలవంతంగా కొన్నా.. వాడటం లేదని రైతులు చెబుతున్నారు. ఈ విషయం పై అధికారులు దృష్టి సారించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నా సంతకం ఫోర్జరీ చేసి.. నగదు డ్రా చేశారు

● పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ ఫిర్యాదు

శావల్యాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తన సంతకాన్ని పంచాయతీ కార్యదర్శి ఫోర్జరీ చేసి.. పనులు చేసినట్లుగా బిల్లులు పెట్టి ఖాతాలోని నగదును దోచేశాడని పోట్లూరు గ్రామ సర్పంచ్ పోపూరి జ్యోతి గురువారం ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను కలసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పోట్లూరు పంచాయతీ కార్యదర్శి పంచాయతీ ఖాతా నుంచి ఆరు విడతలుగా రూ.7,58,198 నగదు విత్‌డ్రా చేశాడని చెప్పారు. బ్యాంకు నుంచి తన ఫోన్‌కు మెస్సేజ్ రావడంతో పంచాయతీ కార్యదర్శిని అడిగితే సమాదానం ఇవ్వకుండా.. తనను పరుష పదజాలంతో దూషించాడని చెప్పారు. ఎస్సీ కాలనీలో డ్రెయినేజీల నిర్మాణం పూర్తిచేసినా.. పంచాయతీ కార్యదర్శి తనకు బిల్లులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, జేసీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. అక్రమ బిల్లులపై పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని, రూ.15 లక్షలు బిల్లులను వెంటనే ఇప్పించాలని సర్పంచ్ కోరారు. ఎంపీడీవో సీతారామయ్యను వివరణ కోరగా తన వద్ద ఎటువంటి సమాచారం లేదన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న పోట్లూరు సర్పంచ్ జ్యోతి

పాపం ఆదాయం లేక.. పరిహారం రాక


మునగతోటలో అంతరపంటగా సాగు చేస్తున్న బంతిపూలు

వినుకొండటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు పూల తోటలపై అధిక లాభాలతో సంతోషంగా ఉండాలన్న రైతుకు చివరకు కన్నీరే మిగిలింది. ప్రకాశం జిల్లా గొర్రెపాడు ప్రాంతం నుంచి వ్యవసాయం కోసం వినుకొండలో స్థిరపడిన రైతు ఆదాం పట్టణంలోని మసీదు మాన్యం సమీపంలో రెండెకరాలు కౌలుకు తీసుకున్నాడు. అర ఎకరా విస్తీర్ణంలోని మునగ పంట వేశారు. దాంతో పాటు అంతర్ పంటగా మొక్క రూ.3 చొప్పున ఎకరాకు 1,400 బంతి మొక్కలను రెండెకరాల్లో నాటారు. ఇటీవల కురిసిన మొంథా తుపాను ధాటికి పూలన్నీ వాడిపోయాయి. సుమారు ఎకరా బంతిపూలను తొలగించాల్సి వచ్చింది. మిగిలిన తోటలోని పూలకు మచ్చరావడంతో సుమారు రూ.1.70లక్షల మేరకు నష్టం వాటిల్లిందని రైతు లబోదిబోమంటున్నారు. పంట నష్టపరిహారం కోసం ప్రయత్నిద్దామన్నా .. కౌలు సాగు కావడంతో.. యజమానుల సహకారం లేదని ఆదాం వాపోయారు.


రెండు రకాల బంతిపూల తోట


విజేత కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, ముఖ్యఅతిథి జీ సూర్యనారాయణ రావు తదితరులు



రన్నర్‌గా నిలిచిన యూనిర్సిటీ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టును అభినందిస్తున్న అతిథులు

ఉత్కంఠ పోరులో విజేత కృష్ణవేణి

● ముగిసిన ఏఎన్‌యూ అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట లోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ గురువారం విజయవంతంగా ముగిసింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ పోటీలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు నిలిచింది. మొదటి రెండు సెట్లలో 27-25, 26-24 పాయింట్లతో కృష్ణవేణి కళాశాల జట్టు ఆధిపత్యం ప్రదర్శించగా.. మూడో సెట్‌లో 22-25లో యూనివర్సిటీ ఎడ్యుకేషన్ జట్టు లైవ్‌లోకి వచ్చింది. అయితే ఏకపక్షంగా సాగిన నాలుగు సెట్‌లో 25-13 తేడాతో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించడంతో విజేతగా నిలిచింది. మూడవ స్థానానికి జరిగిన పోటీలో ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్‌పై బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ విజయం సాధించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడాకారుల్లో కనిపించిన స్ఫూర్తి, క్రమశిక్షణ అభినందనీయం అన్నారు. ముఖ్య అతిథి ఏఎన్‌యూ యోగా కోఆర్డినేటర్ బి.సూర్యనారాయణరావు మాట్లాడుతూ క్రీడలు యువత భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సహకరిస్తాయన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో ఉపయోగ పడతాయన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదర ఆదిబాబు మాట్లాడుతూ కృష్ణవేణి డిగ్రీ కళాశాల విజేతగా నిలచి, యూనివర్శిటీ టోర్నమెంట్‌లో హ్యాట్రిక్ సాధించిందన్నారు. డైరెక్టర్ కే.నాసరయ్య, డాక్టర్ సీహెచ్ వెంకటరావు, డాక్టర్ గౌరీ శంకర్, డాక్టర్ పి. శ్రీనివాసరావు, అమ్మయ్య చౌదరి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, మహమ్మద్ పాల్గొన్నారు.

బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

వినుకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు, అనుమతికి మించి నిర్మించిన భవన యజమానులు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్‌ను వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ గురువారం కోరారు. ఈ అవకాశాన్ని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 12వ తేదీన ఈ స్కీమ్ అమలులోకి వచ్చిందన్నారు. భవన యజమానులు రూ.10వేలు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వినుకొండ పట్టణంలో ఇప్పటికే సిబ్బంది సాయంతో 350కు పైగా భవనాలు గుర్తించామమన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

'ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు చేయించుకోవాలి'

వినుకొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు చేయించుకోవాలని వినుకొండ ప్రభుత్వ వైద్యాధికారి కేఎస్ దయానిధి కోరారు. ఇటీవల నలుగురు వైద్యులు లాంగ్ లీవ్‌పై వెళ్లడంతో కాన్పులకు అంతరాయం ఏర్పడిందన్నారు. జిల్లా అధికారులు వైద్యశాలలోని పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నలుగురు వైద్యులను నియమించినట్లు ఆయన తెలిపారు. డాక్టర్ సౌజన్య, డాక్టర్ రమ్య, డాక్టర్ కవిత, డాక్టర్ మెర్సి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శిరీషలు రోగుల కోసం నిత్యం సేవలు అందిస్తున్నారని, డిసెంబరు 5, 6 తేదీల్లో వైద్యశాలలో జరగనున్న నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ కోసం డాక్టర్ రజాక్, డాక్టర్ అంజలిని కూడా నియమించామన్నారు. గతంలో కంటే మిన్నగా వైద్యశాలలో ఓపీ శాతం పెరిగిందని, రోజుకు 200మందికి పైగా వైద్యశాలకు వచ్చి వివిధ రకాల వైద్య సేవలు పొందుతున్నట్లు ఆయన తెలిపారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) సివిల్ సర్వీస్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు విజయవాడలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మరిన్ని వివరాలకు 9030453891, 7660937002 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

శావల్యాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లు తెగి, ఆ సమయంలో ప్రజలెవ్వరూ లేకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన శావల్యాపురం నుంచి కారుమంచికి వెళ్ళే మార్గంలో శ్రీరామ పబ్లిక్ స్కూల్ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గురువారం మధ్యాహ్నం జరిగింది. అక్కారావు కాంప్లెక్స్ వద్దనున్న విద్యుత్ స్తంభం వద్ద మంటలు చెలరేగాయి. స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

చిలకలూరిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో గురువారం రాత్రి చిలకలూరిపేట అర్బన్ పోలీసులు ఆటో డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్బన్ సీఐ పి.రమేష్ ఆటో డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రయాణికుల భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్స్, ఆర్సీ ఇన్సూరెన్స్ పత్రాలు ప్రతి ఆటో డ్రైవర్ వెంట ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు.

క్లుప్తంగా...

● నాదెండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులోని బండారుపల్లివారిపాలెం హిందూ శ్మశాన వాటికలో కర్మకాండలు నిర్వహించుకొనేందుకు ఏర్పాటు చేయనున్న గది నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. దాతల సహకారంతో సుమారు రూ 15 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

● యడ్లపాడు: గుంటూరుకు చెందిన సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్ కరస్పాండెంట్ సహకారంతో మండలంలోని కొండవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. గురువారం సుమారు 150మంది విద్యార్థులకు రూ.9వేల విలువైన పరీక్ష ప్యాడ్లను అందచేశారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు షేక్ జున్నుసాహెబ్ విద్యార్థులకు వాలీబాల్‌ను బహుమతిగా అందజేశారు.

● నూజెండ్ల: మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులకు నవంబరు 29 నుంచి జనవరి 4వ తేదీ వరకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో కే సత్యనారాయణ, ఎన్ రవిచంద్రలు గురువారం తెలిపారు. 29వ తేదీన ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

● నరసరావుపేట లీగల్: పల్నాడు జిల్లా సచివాలయాల పరిధిలోని ఏఎన్‌ఎంలు తమను వైద్య ఆరోగ్యశాఖ విధులకు మాత్రమే పరిమితం చేయాలని కోరుతూ నేటి నుంచి వైద్య ఆరోగ్యశాఖ విధులకు గైర్హాజరు అవుతున్నట్లు ఏఎన్‌ఎం ప్రతినిధులు గురువారం తెలిపారు. ఈ మేరకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

● ఈపూరు: ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు పల్నాడు బాలోత్సవంలో పాల్గొంటున్న మోడల్ స్కూల్ కోలాటం సభ్యులకు పరికరాలను ఉచితంగా అందజేశారు. 20 మంది విద్యార్థులకు చీరలు, గజ్జెలు, కర్రలు ఇతర కాస్మోటిక్స్‌ను శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రామతులసి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఈవో చంద్రకళ గురువారం తనిఖీ చేశారు. తరగతి గదులను, మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో బోధనా విషయాలపై ఉపాధ్యాయులతో మాట్లాడారు.

నూతన విధానాలను ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబు

● దింతెనపాడులో రైతన్నా మీ కోసంలో ప్రత్తిపాటి


రైతులకు లేఖను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతే రాజు అన్న మాటను నిజం చేయాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు వ్యవసాయరంగంలో నూతన విధానాలు అమలు చేసేందుకు రైతుల్ని ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడు మండలం దింతెనపాడులో గురువారం సాయంత్రం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమం జరిగింది. వ్యవసాయాధికారులు, సిబ్బందితో కలసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన పంచసూత్రాలపై అవగాహన కల్పించడంతోపాటు చంద్రబాబు లేఖను అందించారు. అనంతరం గ్రామంలో రూ.32లక్షలతో నిర్మించనున్న పంచాయితీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభదాయక పంటల సాగువైపు రైతులు దృష్టి సారించాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం, ఉత్పత్తుల్ని మార్కెటింగ్ చేసుకోవడానికి వీలైన ఫుడ్ ప్రాసెసింగ్ వంటి సరికొత్త విధానాలపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు.

కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కరిముల్లా, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరరావు, మద్దూరి వీరారెడ్డి, పోపూరి వెంకయ్య, మాణిక్యరావు, అత్తోట శ్రీను, చౌదరి, చంద్రకళరాజు, అత్తోట రామారావు, ఏవో హరిప్రసాద్, ఎంపీడీవో హేమలతాదేవి, పంచాయతీరాజ్ డీఈఈ బాలకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతకుంట రత్నమ్మకు నివాళి

చిలకలూరిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామంలో గురువారం జరిగిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ అంత్యక్రియల కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం పాల్గొన్నారు. రత్నమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీఎం రమేష్‌కు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి పురస్కారం


విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సచివాలయంలో ఏర్పాటుచేసిన మాక్ అసెంబ్లీలో ప్రతిభ చూపిన విద్యార్థినికి ఉత్తమ ప్రతిభ పురస్కారం లభించింది. నరసరావుపేట మండలం కాకాని గ్రామానికి చెందిన జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని వక్కలగడ్డ కాత్యాయని నమూనా శాసనసభ సమావేశంలో హౌసింగ్ అండ్ ఇండస్ట్రీస్, పబ్లిక్ రిలేషన్స్ మంత్రిగా వ్యవహరించింది. పురస్కారం అందుకున్న సందర్భంగా నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు వక్కలగడ్డ కాత్యాయనిని గురువారం అభినందించారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఈ నమూనా శాసనసభ సమావేశం ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసనసభ నిర్వహణ గురించి ఆచరణాత్మక అనుభవం లభించిందన్నారు. కాత్యాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కాత్యాయని ప్రదర్శించిన నాయకత్వ లక్షణాలు, వాదనా సామర్థ్యం దేశ రాజకీయాల్లో భవిష్యత్తులో మంచి నాయకురాలిగా ఎదగడానికి మార్గం సుగమం చేస్తాయన్నారు.

ఘనంగా శిఖర కలశ ప్రతిష్ఠ


శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యక్కలవారిపాలెంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శిఖర కలశ, నూతన ధ్వజ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి: ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సొసైటీ సిబ్బంది నిరంతరం రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం నరసరావుపేట ప్రకాష్ నగర్‌లో లింగంగుంట్ల సొసైటీ నూతన కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రైతుల సమస్యలను త్వరగా పరిష్కరించేలా చూడాలని, సొసైటీ ద్వారా అందించే సేవలు సమర్థవంతంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, పాల్గొన్నారు.

రైతుల కోసం నిరంతరం శ్రమిస్తున్న చంద్రబాబు

రొంపిచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం రైతుల కోసం శ్రమిస్తున్నాడని ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు గురువారం తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల గుండెల్లో కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను నిట్టనిలువునా ముంచిందని తెలిపారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతన్న మీ కోసం వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

● ఉమ్మడి గుంటూరు జిల్లా డీడీ తోయజక్షరావు


కారుమంచిలో రీ సర్వేలో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూవివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే పనులను సర్వే సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ తోయజక్షరావు అన్నారు. మండలంలోని కారుమంచి రెవెన్యూ పరిధిలో జరుగుతున్న రీ సర్వే పనులను పల్నాడు జిల్లా సర్వేయర్ భానుకీర్తి, డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాస్‌తో కలసి గురువారం పరిశీలించారు. రీసర్వే రికార్డులు తనిఖీచేసి రైతులతో మాట్లాడారు. తోయజక్షరావు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం నుంచి పట్టాలుపొందిన లబ్ధిదారులను మాత్రమే రీసర్వేలో హక్కుదారులుగా నమోదు చేయాలని, మరెవరికైనా విక్రయిస్తే వారి పేర్లు నమోదు చేయవద్దన్నారు. కారుమంచి రెవెన్యూ పరిధిలో మొత్తం 7226ఎకరాలు విస్తీర్ణం ఉండగా ప్రస్తుతం 6400ఎకరాలు సర్వే పూర్తయిందని, రోజుల వ్యవధిలో మిగిలిన సర్వేని కూడా పూర్తి చేయాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు. సర్వే పూర్తికాగానే రికార్డు పనులు పూర్తిచేసి రైతుల నుంచి పిర్యాదులు స్వీకరిస్తామన్నారు. వారితో తహసీల్దార్ అర్జున్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, మండల సర్వేయర్ రవికుమార్, వీఆర్వోలు దేవమ్మ, రాధ పాల్గొన్నారు.

● ఈపూరు: సంయుక్త సర్వే ద్వారా యజమానులకు హక్కు పత్రాలు అందజేయడం జరుగుతుందని, తద్వారా స్థిర ఆస్తులకు విలువ చేకూర్చుకోవచ్చనని ఈపూరు సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ సర్వే మండలంలోని కొచ్చర్ల పంచాయతీలో సెక్రటరీ తిరుపతి ఆధ్వర్యంలో గురువారం ఆమె ప్రారంభించారు. సర్వేలో 8 బృందాలు పాల్గొన్నాయి. పంచాయతీ పరిధిలో 2500 పీపీఎన్ నెంబర్లను సర్వే చేశారు. గృహాలు, ఖాళీ స్థలాలను సర్వేచేసి మ్యాప్‌లో నమోదు చేసుకున్నారు. సర్వే అనంతరం యజమానులకు ప్రాపర్టీ కార్డు అందజేస్తామని సెక్రటరీ తిరుపతి వెల్లడించారు.


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు షిఖా మీల్ బలాలా

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యం

● ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు షిఖా మీల్ బలాలా

వినుకొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంఘటన సృజన అభియాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ బలోపేతం దిశగా పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని కాలువకట్ట వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు, రాజస్థాన్ ఎమ్మెల్యే షిఖా మీల్ బలాలా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చాలా రాజకీయ పార్టీలు బీజేపీకి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతు ఇస్తున్నాయని, దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిజంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అలెగ్జాండర్ సుధాకర్, బోయపాటి రామాంజనేయులు, కుర్షిదా బేగం, శివ నాగేశ్వరరావు, బాలిరెడ్డి, నాగూర్ భాషా, పఠాన్ కరీముల్లా ఖాన్, పిడుగు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఏమి చేయటం లేదని విమర్శించారు. ఈ ప్రభుత్వ హయాంలో గిట్టుబాటు ధర లేదన్నారు. 200 కోట్లతో పొగాకు కొనుగోలు చేస్తామన్న ఈ ప్రభుత్వం ఇప్పటికి 100 కోట్ల రూపాయల వరకు కూడా కొనలేదని ఎద్దేవా చేశారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో శావల్యాపురం విద్యార్థుల ప్రతిభ

శావల్యాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యస్తారియా బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శిని, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియంల ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహించిన దక్షిణ భారత సైన్స్ ఎగ్జిబిషన్‌లో శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి 4 సైన్స్ ప్రయోగాల్లో ప్రథమస్థానంలో నిలిచారని ఇన్‌చార్జి హెచ్‌ఎం కవిత గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, శావల్యాపురం, పొట్లూరు, వేల్పూరు జడ్పీ పాఠశాల నుంచి ఒక్కో పాఠశాల నుంచి విద్యార్థులు 8 సైన్స్ ప్రయోగాలు తయారుచేసి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించినట్లు తెలిపారు. శావల్యాపురం విద్యార్థులు ప్రదర్శించిన 4 ప్రయోగాలు, కారుమంచి, పొట్లూరు, వేల్పూరు విద్యార్థులు ప్రదర్శించిన ఒక్కొక్క ప్రయోగాన్ని త్వరలో నరసరావుపేటలో జరగనున్న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల ప్రయోగాల్లో శావల్యాపురం జడ్పీ పాఠశాల సైన్స్ టీచర్ వసంతరావు ప్రదర్శించిన ప్రయోగాన్ని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు, టీచర్ వసంతరావును ఇన్‌చార్జి హెచ్‌ఎం, సైన్స్ ఉపాధ్యాయులు అభినందించి బహుమతులు అందజేశారు.

స్విమ్మింగ్‌లో ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల విద్యార్థికి రజత పతకం



కే శివసాకేత్

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల శీతాకాలపు స్విమింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలో ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల విద్యార్థి కే శివసాకేత్ రజత పతకం సాధించాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ గురువారం తెలిపారు. విశాఖపట్నం బీచ్ రోడ్ ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 22, 23 తేదీలలో జరిగిన ఈ పోటీలలో 200మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో ఈ ఘనత సాధించాడన్నారు. డిసెంబరు 21, నుంచి 23వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో జరగనున్న 36వ సౌత్ జోన్ జాతీయ స్విమ్మింగ్ పోటీలలో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా శివసాకేత్‌ను విద్యార్థులు, కళాశాల యాజమాన్యం అభినందించారు.


ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు సిబ్బంది

పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'బాల్య వివాహ ముక్త్ భారత్'

నరసరావుపేట లీగల్, నవంబర్ 27, (ఆంధ్రజ్యోతి), పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు గురువారం జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు సిబ్బందితో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కోసం పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. బాలల విద్య, రక్షణ, భవిష్యత్తు కోసం బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ ఎల్ గోపీనాథ్, అడ్మిన్ ఆర్ఐ ఎస్.కృష్ణ, ఎంటీఆర్ఐ యువరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.


బీరువాను అందజేస్తున్న దాతలు, పక్కన ఆలయ సేవకులు

దేవాలయానికి రెండు బీరువాల వితరణ

వినుకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొండమెట్ల వద్ద ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి విశ్వమాత గో సంరక్షణ ఆశ్రమ స్వామివారి కైంకర్యాల నిమిత్తం వినుకొండ పట్టణ ఆగబావి బజార్‌కు చెందిన విశ్రాంత హెచ్‌ఎం గాండ్ల నాగేంద్రుడు, విశ్రాంత టీచర్ వేములపాటి సామ్రాజ్యం దంపతులు 20వేల రూపాయల విలువ గల బీరువాను వితరణగా ఇచ్చారు. దేచవరం గ్రామానికి చెందిన దొడ్డ ప్రతాపరెడ్డి, శివలీల, మతుకుమల్లి ఏటుకూరి ఈశ్వరమ్మ మరో రూ. 20వేలు విలువ గల మరో బీరువా ఆలయ ప్రధాన సేవకులు జాజుల మాల్యాద్రికి అందజేశారు. అనంతరం అర్చకులు దాతలకు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు తిరువాయి పార్టీ హనుమంత సూరి, కాకుమాను రామారావు, బద్దిక నరసింహారావు, పిచ్చయ్య, పి.రమ, బి.సుజాత, సరోజనమ్మ, పత్తి భ్రమరాంబ, పెరవల్లి శ్రీదేవి, వైనాగలక్ష్మి తదితర దేవస్థాన భక్తబృందం పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 53 మందికి ఉద్యోగాలు


నియామక పత్రాలను అందిస్తున్న చిత్రం

నాదెండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గణపవరం గ్రామంలోని సీఆర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. కాగా 53మంది ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ సమస్యను రూపు మాపేందుకు కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ చుండి రంగ నాయకులు, ప్రిన్సిపల్ మనోహర్, ఇన్‌చార్జ్ నిరంజన్, జిల్లా ఉద్యోగ కల్పన అధికారి రవీంద్ర నాయక్, కో-ఆర్డినేటర్ సురేష్, అంజిరెడ్డి, అనూష తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

● అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఝాన్సీదయాసాగర్

యడ్లపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీలకు అధికారులు ఎక్కడా గౌరవం ఇవ్వడం లేదంటూ ఎంపీటీసీ సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ అధ్యక్షతన వాడివేడిగా జరిగింది. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు పలు శాఖల అధికారుల తీరును తప్పుపడుతూ మండపడ్డారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులను సహించేది లేదని, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులు కొనసాగించాలని ఎంపీపీ పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన సభ్యులలో ముందుగా సొలస ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండల పరిషత్‌కు దేనికి కేటాయించి నిధులు ఖర్చు చేస్తున్నారో అధికారులు చెప్పడం లేదని, తమ గ్రామంలో జరిగే పనులు గురించి తెలియకపోవడం అవమానమన్నారు. యడ్లపాడు ఎంపీటీసీ కీర్తి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎవరు చేస్తున్నారో, వాటికి కేటాయించిన నిధులెంతో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీకి అర్థంకాని పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీ స్వాగత ద్వారానికి పార్టీ రంగులు వేయడం, యడ్లపాడు గ్రామ సచివాలయ ప్రారంభోత్సవాలకు స్థానిక ఎంపీటీసీలకు ఆహ్వానం పంపిన అధికారులు శిలాఫలకాలపై పేర్లు వేయకుండా అధికార పార్టీ వారికి ప్రాధాన్యం ఇచ్చి ప్రోటోకాల్ పాటించకపోవడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. అలాగే యడ్లపాడు ఎస్సీ కాలనీలో విద్యుత్ లూప్‌లైన్ల సమస్య పరిష్కరించకుండా ఎంపీటీసీ అరుణ్‌కుమార్ నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖో ఖో పోటీలకు గీతమ్స్ విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కృష్ణవేణి

వినుకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్ధార్థనగర్‌లోని గీతమ్స్ హైస్కూల్ విద్యార్థులు మారెళ్ళ అభినాష్ రెడ్డి, నక్క సాయిచరణ్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. పాఠశాలలో గురువారం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి పాల్గొని వారిని అభినందించారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే రెండేళ్లు జైలు శిక్ష

● స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి

నరసరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించినా బాల్య వివాహాలకు హాజరైన వారికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించడం జరుగుతుందని పల్నాడు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. నరసరావుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సీడీపీవో కాంతకుమారి అధ్యక్షతన గురువారం నరసరావుపేట పట్టణంలోని షాదీఖానాలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. పల్నాడు జిల్లాను బాల్య వివాహరహిత జిల్లాగా చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ ఆఫీసర్, నరసరావుపేట ఎంఈవో, రొంపిచర్ల ఎమ్మార్వో, రొంపిచెర్ల ఎంపీడీవో, నరసరావుపేట మెడికల్ ఆఫీసర్, మిషన్ శక్తి కోఆర్డినేటర్, బాలల పరిరక్షణ విభాగం, వన్‌స్టాప్ సెంటర్, ఐసీడీఎస్ నరసరావుపేట సీడీపీవో, ఏసీడీపీవో, సూపర్‌వైజర్లు, నీడ్స్, ఎన్‌జీవో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఈసీలో నేను సైతం విజయవంతం

నరసరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఇక్వాక్, ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నేను సైతం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి: ఏజీఎం

నరసరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా అందిస్తున్న శ్రీనిధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనిధి జిల్లా అసిస్టెంటు జనరల్ మేనేజరు ఎం.నరసింహారావు తెలిపారు. నరసరావుపేట మండల వెలుగు కార్యాలయంలో గురువారం మండలంలోని అన్ని గ్రామాల వివోఏలకు శ్రీనిధి రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గడిచిన 8 నెలల కాలంలో పల్నాడు జిల్లాలో శ్రీనిధి రుణాలు రూ 44 కోట్లు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపిఎం భరత్, సీసీలు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ: డాక్టర్ నగేష్

యడ్లపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విత్తేముందు విత్తనాలను శుద్ధి చేసుకోవడం ద్వారా పురుగులు, తెగుళ్ల బారినుంచి నెల రోజుల వరకు పంటను కాపాడుకోవచ్చని ఏరువాక కేంద్రం పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ అన్నారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని జగ్గాపురంలో రబీలో సాగుచేస్తున్న శనగ, మొక్కజొన్న యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటుచేశారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యగోపాల్ ఆకు మాడు తెగులు, తుప్పు తెగులు నివారణకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు కీర్తి, శ్రీనిధి, జోషితా శ్రేయ, అనగాని బేబీవిజయలక్ష్మి, గాయత్రి, జ్యోత్స్న, అభ్యుదయ రైతు పోపూరి శివరామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

వినుకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచన ప్రకారం నవంబరు 30, డిసెంబరు ఒకటో తారీఖున ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ రవికుమార్ సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలోని ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట కోతకు వచ్చినట్లయితే ఈ నెల 29వ తారీకు లోపు పంట కోసుకొని ధాన్యాన్ని తడవకుండా నిల్వ చేసుకోవాలన్నారు.